COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-30-9, CPI(M) State Committee Office
AKulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: apcpim@gmail.com

విజయవాడ,
తేది : 21 జూలై, 2023.

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.జయరాం,** ఆఫీసు కార్యదర్శి

విషయం : **జీడిమామిడి గింజలను ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని, రైతులను, కార్మికులను ఆదుకోవాలని కోరుతూ...**

**అర్యా!**

దేశంలో జీడిమామిడి సాగు విస్తీర్ణంలో (197.92 వేల హెక్టార్లు), ఉత్పత్తిలో (127.72 వేల మె. టన్నులు) ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో ఉంది. అదే విధంగా జీడి పప్పు ప్రోసెసింగ్‌లోనూ కేరళ తరువాతి స్థానం ఆంధ్రదే. తొలుత తీర ప్రాంత జిల్లాల్లో జీడి పంట సాగు చేస్తుండగా ఆ తరువాత గిరిజన ప్రాంతాల్లోనూ పెరిగింది. వాటిలో కొన్ని అటవీశాఖ వేసిన తోటలు కాగా ఎక్కువ భాగం గిరిజనులు, కొండ వాలు ప్రాంతాల్లో దళితులు, ఇతర పేదలు సాగు చేస్తున్నవి గణనీయంగా ఉన్నాయి. కాబట్టి ఐదు లక్షలకు పైగా రైతు కుటుంబాలను, లక్షన్నర మంది కార్మికులను ఆదుకునేందుకు, అలాగే పరిశ్రమకు చేయూతనివ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉందని మీ దృష్టికి తెస్తున్నాము.

గతంలో రూ.15,000, 18,000 అమ్మిన 80 కిలోల జీడి గింజల బస్తా ధర గడచిన రెండుమూడేళ్లుగా దిగజారుతూ ప్రస్తుతం రూ.7,000 నుండి 8,000 మధ్యలో వుంది. ధర ఘోరంగా పడిపోవడంతో జీడి గింజలు రైతుల ఇళ్లలోనే పేరుకుపోయాయి. ఆర్‌బికెల ద్వారా బస్తా రూ. 16,000 చొప్పున కొనుగోలు చేయాలని రైతులు ఆందోళనలు చేస్తున్నారు. కాని, 'విత్తు నుండి విక్రయం వరకూ అంతా ఆర్‌బికె ద్వారానే' అని ప్రకటించిన ప్రభుత్వం జీడి పంట విషయంలో ఆ ఊసెత్తకపోవడం ధర్మం కాదు. కొన్నేళ్ల క్రితం జీడి గింజలను గిరిజన కార్పొరేషన్ కొనుగోలు చేసి, ప్రోసెస్ చేయించి మార్కెటింగ్ చేసింది. ఇప్పుడు అది కూడా లేదు. రాష్ట్రంలో జీడి గింజలను ప్రభుత్వ సంస్థ ఏదీ కొనుగోలు చేయడంలేదు.

జీడి గింజలపై 5 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం 2018 ఫిబ్రవరి నుండి 2.5 శాతానికి తగ్గించారు. అలాగే జీడిపప్పు కనీస దిగుమతి ధర (మినిమమ్ ఇంపోర్ట్ ప్రైస్ ఎంఐపి) 2023 ఫిబ్రవరిలో సడలించి విచ్చలవిడి దిగుమతులకు తలుపులు బార్లా తెరిచి దేశీయ పరిశ్రమకు, రైతాంగానికి నష్టం కలిగిస్తోంది. గత ఆరేడేళ్లుగా కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పంట విస్తీర్ణం, దిగుబడి పెంచడానికి వివిధ చర్యలు, పథకాలు చేపట్టింది. జీడి పంట అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక రాష్ట్ర స్థాయి బోర్డు, పరిశ్రమలకు అవసరమైన ముడి సరుకు అంటే జీడి గింజలను రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లో అలాగే విదేశాలనుండి కొనుగోలు చేసేందుకు ఒక కార్పొరేషన్, పరిశ్రమలను నిర్వహించడం, జీడిపప్పు మార్కెటింగ్ కోసం మరో రెండు వేర్వేరు కార్పొరేషన్లున్నాయి. ఇన్ని

విధాలుగా అక్కడి ప్రభుత్వం రైతులకు, కార్మికులకు చేదోడుగా నిలుస్తోంది. ఒడిషా, మహారాష్ట్ర, కర్ణాటకల్లో పంట అభివృద్ధికి సంస్థ లేదా ప్రభుత్వ బోర్డులున్నాయి. కానీ ఎపిలో మాత్రం కేవలం ఉద్యానవన శాఖ అన్ని పంటలతోపాటు జీడి గురించి 'కూడా' పని చేస్తుంది. ఇప్పటికైనా రాష్ట్రంలో జీడి రైతును, కార్మికులను ఆదుకునేందుకు, పరిశ్రమను నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కింది చర్యలు చేపట్టాలని కోరుతున్నాము.

(1) రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రైతుల నుండి బస్తా జీడి గింజలను రూ. 16,000కు ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలి.

(2) జీడి పంటను రికార్డుల్లో నమోదు చేసి, పంట రుణాలు ఇవ్వాలి. బీమా వర్తింపజేయాలి.

(3) జీడి పంట అభివృద్ధి, పరిశోధనకు వెంటనే ప్రభుత్వం ప్రత్యేక బోర్డు లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

(4) టిటిడితో సహా అన్ని దేవస్థానాలకూ రాష్ట్రంలో ప్రోసెస్ చేసిన జీడి పప్పు మాత్రమే కొనుగోలు చేయాలి.

(5) దిగుమతి సుంకాన్ని తిరిగి 5 శాతానికి పెంచేలా, జీడిపప్పు ఎంఐపి సడలింపులు ఎత్తివేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

అభివందనములతో...

**(వి. శ్రీనివాసరావు)**

రాష్ట్ర కార్యదర్శి